ఐనవోలులో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కడియం, మాజీ మంత్రి ఎర్రబెల్లి, మాజీ ఎమ్మెల్యే అరూరి, ఎమ్మెల్సీ సారయ్య, డీసీసీబీ చైర్మన్ మార్నేని

ఐనవోలు మల్లికార్జున స్వామి ఆలయానికి బోనాలతో తరలి వస్తున్న భక్తులు

కొత్తకొండ వీరభద్ర స్వామి ఆలయానికి గుమ్మడి కాయలతో వస్తున్న భక్తులు

కొత్తకొండలో పూజలు చేస్తున్న ఎంపీ బండి సంజయ్

ఖిలావరంగల్ : తన ఇంటి ఎదుట ముగ్గు వేస్తున్న మంత్రి కొండా సురేఖ

భోగి సంబురం.. జాతర వైభవం

- వరంగల్, హనుమకొండ జిల్లాల వ్యాప్తంగా ఉత్సాహంగా పండుగ
- భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు
- పలుచోట్ల కైట్ ఫెస్టివల్స్

నమస్తేతెలంగాణ నెట్‌వర్క్ : వరంగల్, హనుమకొండ జిల్లాల వ్యాప్తంగా ఆదివారం భోగి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలు భోగి మంటలు వేసుకొని వేడుకల్లో పాల్గొన్నారు. హంటర్‌రోడ్డులోని మాజీ ఎంపీ కెప్టెన్ లక్ష్మీకాంతారావు ఇంట్లో బొమ్మల కొలువు సందడి నెలకొంది. ఆయన సతీమణి వొడితల సరోజినీ దేవి, మాజీ ఎమ్మెల్యే సతీశ్ కుమార్ సతీమణి డాక్టర్ షమిత, కుమార్తె డాక్టర్ పూజిత, కోడలు డాక్టర్ శంసిత బొమ్మల కొలువును తీర్చిదిద్దారు. అలాగే, సుబేదారిలోని ఆర్ట్స్ కళాశాలలో గ్రేటర్ ఆధ్వర్యంలో నిర్వహించిన పతంగుల ఉత్సవం (కైట్ ఫెస్టివల్)లో పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై పతంగులను ఎగురవేశారు. అదనపు కలెక్టర్ రాధికాగుప్తా, ట్రైనీ కలెక్టర్ శ్రద్ధాశుక్లా, ఈవీ శ్రీనివాస్ రావు పాల్గొన్నారు. అలాగే, నర్సంపేట మండలంలోని మహేశ్వరం శివారు గ్రీన్‌రిసార్ట్‌లో నిర్వహించిన కైట్ ఫెస్టివల్‌లో సినీనటులు మాధవీలత, గీతాసింగ్‌తోపాటు పలువురు కమెడియన్లు హాజరై సందడి చేశారు. బీఆర్‌ఎస్ డివిజన్ నాయకుడు డాక్టర్ లెక్కల విద్యాసాగర్‌రెడ్డి, విద్యారెడ్డి, మేనేజర్ శ్రీకాంత్ పాల్గొన్నారు. అలాగే, నర్సంపేటలో శాంతి సేనా రైతు సంఘం ఆధ్వర్యంలో పశువుల అందాల పోటీలు నిర్వహించారు. ఇందులో జోడెడ్లు, ఆవుదూడలు, కాడెడ్లు, ఆవులు, గొర్రె, మేక పోతులు, కోళ్లు పాల్గొన్నాయి. కాగా, మంత్రి కొండా సురేఖ హనుమకొండలోని తన ఇంటి ఎదుట ముగ్గులు వేసి, ప్రజలకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

భక్తులతో కిక్కిరిసిన ఐనవోలు మల్లన్న ఆలయ పరిసరాలు

హనుమకొండ : కెప్టెన్ లక్ష్మీకాంతారావు ఇంట్లో ఏర్పాటు చేసిన బొమ్మల కొలువు

హనుమకొండ : ఆర్ట్స్ కాలేజీలో పతంగి ఎగురవేస్తున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

నర్సంపేటలో జరిగిన పశువుల అందాల పోటీల్లో పాల్గొన్న కాడెద్దులు

నర్సంపేట : కైట్ ఫెస్టివల్‌లో పాల్గొన్న సినీ నటులు మాధవీలత, గీతాసింగ్

హనుమకొండలో ఇంటి ముందు భోగి ముగ్గు వేస్తున్న యువతి

ప్యాసింజర్ రైళ్లు నేటి నుంచి పునఃప్రారంభం

కాజీపేట, జనవరి 14 : సికింద్రాబాద్ రైల్వే డివిజన్ పరిధిలోని కాజీపేట మీదుగా పలు ప్యాసింజర్ రైళ్లను సోమవారం నుంచి పునఃప్రారంభించినట్లు రైల్వే అధికారులు తెలిపారు. కాజీపేట-బల్లార్షా, కాజీపేట-విజయవాడ, కాజీపేట- సికింద్రాబాద్ సెక్షన్లలో జరుగుతున్న మూడోలైన్ పనుల కారణంగా రైల్వే అధికారులు కాజీపేట జంక్షన్ మీదుగా నడిచే దాదాపు 20 వరకు పుష్‌పుల్, ప్యాసింజర్, ఎక్స్‌ప్రెస్ రైళ్లను రద్దు చేశారు. నేటి నుంచి విజయవాడ పుష్‌పుల్, మహబూబాబాద్ పుష్‌పుల్, సికింద్రాబాద్ పుష్‌పుల్, రామగిరి, సింగరేణి, కాగజ్‌నగర్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను యథావిధిగా నడుపుతున్నట్లు అధికారులు తెలిపారు.

హోంగార్డు ఓవర్ యాక్షన్
వాహనదారుడిపై వాకీటాకీతో దాడి

సుబేదారి, జనవరి 14 : వాహనదారుడిపై ట్రాఫిక్ హోం గార్డు దాడి చేసిన ఘటన ఆదివారం హనుమకొండ అశోకా జంక్షన్ వద్ద జరిగింది. వరంగల్ ఎల్‌బీనగర్‌కు చెందిన ఫయాజ్ నంబర్ ప్లేట్ లేని బైక్‌పై హనుమకొండ వెళ్తుండగా, హనుమకొండ చౌరస్తాలో ట్రాఫిక్ పోలీసులు బైక్‌ను ఆపేందుకు ప్రయత్నించారు. సదరు వ్యక్తి బైక్ ఆపకుండా వెళ్లాడు. దీంతో ట్రాఫిక్ ఎస్సై మనోజ్ అశోకా జంక్షన్‌లో డ్యూటీలో ఉన్న పోలీసులకు సమాచారమిచ్చి నంబర్ ప్లేట్ బైక్‌ను ఆపాలని ఆదేశించాడు. అశోకా జంక్షన్‌లోనూ బైక్ ఆపకుండా వెళ్తున్న యువకుడిని ట్రాఫిక్ హోంగార్డు అడ్డుకొని చేతిలో ఉన్న వాకీటాకీతో తలపై కొట్టాడు. దీంతో అతడికి రక్తస్రావమడంతో స్థానికులు హోంగార్డుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సదరు యువకుడు పోలీసు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లగా, హోంగార్డుపై క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

జాతీయ స్థాయి సదస్సుకు సర్పంచ్ బాలిరెడ్డి

గీసుగొండ, జనవరి 14 : ఈ నెల 18 నుంచి 25వ తేదీ వరకు తిరుపతి పద్మావతి మహిళా విశ్వ విద్యాలయంలో జరుగనున్న జాతీయ స్థాయి సదస్సుకు మరియపురం సర్పంచ్ అల్లం బాలిరెడ్డి హాజరువుకానున్నారు. గ్రామంలో సీజనల్ వ్యాధులు ఆరికట్టేందుకు తీసుకున్న జాగ్రత్తలపై సదస్సులో వివరించనున్నారు.

మహిళా ఇంజనీర్లకు నగదు స్కాలర్‌షిప్

పోచమ్మమైదాన్, జనవరి 14: గూగుల్ సపోర్ట్‌తో టాలెంట్‌స్ప్రింట్ ఆధ్వర్యంలో మహిళా ఇంజనీర్లకు ఉచితంగా నగదు స్కాలర్‌షిప్‌లను అందజేయనున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఇంజనీరింగ్ మొదటి సంవత్సరం చదువుతున్న మహిళా ఇంజనీర్లు వృత్తిపరమైన లక్ష్యాలను సాధించడానికి ఆర్థిక సహాయం ఇవ్వనున్నారని పేర్కొన్నారు. వివిధ ఆర్థిక, సామాజిక నేపథ్యాలను దృష్టిలో పెట్టుకుని 200ల మంది విద్యార్థినిలకు సీట్లను అందిస్తుందని, ఈ ప్రోగ్రాంలో ఎంపికైన విద్యార్థినిలకు గూగుల్ ఇంజనీర్లతో మెంటార్‌షిప్ ప్రోగ్రాంలు, నెట్ వర్కింగ్ ఈవెంట్‌కు యాక్సెస్ పొందుతారని వారు వివరించారు. ఇందులో ఈ నెల 18వరకు దరఖాస్తు చేసుకోవాలని, సమాచారం కోసం we.talentsprint.com సంప్రదించాలని సూచించారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

సెప్టిక్ ట్యాంక్ క్లీనర్

★ సెప్టిక్ ట్యాంక్ క్లీనర్ నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్ఫర్ మిషన్ ద్వారా సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేయబడును. డి.ఎస్. రావు. Cont: 9849145043, 9866584455.
NTW-323107

కావలెను

★ రామప్ప జూనియర్ కళాశాల వంటశాలలో పని చేయుటకు భార్య భర్తలు లేదా స్త్రీ (4), పురుషులు (4) కావలెను. ఆకర్షణీయమైన జీతం+వసతి మరియు భోజనం. వెంటనే సంప్రదించవలసిన సెల్ నెం.: 9985299479.
NTW-13590

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777618
9182777213
WARANAGAL
9182777556
9182777557
9182777558
JAYASHANKAR BHUPALPALLY
9182777559
MULUGU
9182777135
MAHABUBABAD
9182777554
JANGAON
9182777565

వేర్వేరు కారణాలతో ఇద్దరి మృతి
బియ్యం ట్యాంక్‌లో పడి యువకుడు, చెరువులో పడి యువతి మృతి

మడికొండ, జనవరి 14 : వేర్వేరు కారణాలతో ఇద్దరు మృతి చెందిన ఘటన ఆదివారం జరిగింది. ధర్మసాగర్ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్‌రావు కథనం ప్రకారం.. బీహార్‌కు చెందిన బుద్దన్‌కుమార్(21) రెండు నెలల నుంచి మారుచి ఆగ్రో ఇండస్ట్రీస్‌లో హమాలీగా పని చేస్తున్నాడు. ఈ క్రమంలో బియ్యం ట్యాంకు నుంచి పారాబాయిల్డ్ రైస్ కిందకు రాకపోవడంతో ట్యాంక్‌లోకి దిగి సరి చేస్తున్న క్రమంలో ఒక్కసారిగా బియ్యం అతడిపై పడ్డాయి. బుద్దన్‌కుమార్ ఊపిరాడక అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి సోదరుడు లాల్‌బహదూర్ చౌదరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. అలాగే, గ్రేటర్ 64వ డివిజన్ ఉనికిచర్లకు శివారులోని పారం చెరువులో పడి యువతి మృతి చెందింది. ఆక శ్రీనివాస్ కూతురు లోహిత డిగ్రీ పూర్తి చేసి ఇంటి వద్ద పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్నది. శ్రీనివాస్ అందుబాటులో లేకపోవడంతో లోహిత బర్రెలను పారంకుంట చెరువు వైపు తీసుకెళ్లింది. కుంటలోకి దిగిన లోహిత జారి పడి మృతి చెందింది. తండ్రి శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

గీసుగొండ, జనవరి 14 : చికిత్స పొందుతూ ఆటో డ్రైవర్ మృతి చెందిన ఘటన గ్రేటర్ వరంగల్ 16వ డివిజన్ కీర్తినగర్ కాలనీలో ఆదివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇటుకల మల్లేశం (52) కీర్తినగర్ నుంచి గరీబ్‌నగర్‌కు వెళ్తుండగా, ఆటో అదుపు తప్పి మ్యాన్ హోల్ పడింది. దీంతో మల్లేశం గాయాలపాలయ్యాడు. స్థానికులు, కుటుంబ సభ్యులు 108 ద్వారా ఎంజీఎం దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందాడు మృతుడి భార్య స్వరూప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ రామకృష్ణ తెలిపారు.

తల్లికి తలకొరివి పెట్టిన కూతురు

అంత్యక్రియల్లో పాల్గొన్న భావన

సంగెం, జనవరి 14 : తల్లి గుండెపోటుతో మృతి చెందడంతో కూతురు తల్లికి తలకొరివి పెట్టిన ఘటన ఆదివారం మండలంలో జరిగింది. ఎల్గూర్‌రంగంపేట గ్రామానికి చెందిన మండల నిర్మల (45) ఆదివారం గుండెపోటుతో మృతిచెందింది. మృతురాలికి ఇద్దరు కూతుర్లు ఉన్నారు. కాగా, పెద్ద కూతురు భావన తల్లి అంత్యక్రియలు నిర్వహించింది.

కార్పొరేటర్ సురేశ్ అరెస్ట్

గిర్మాజీపేట, జనవరి 14 : చిట్టీల పేరుతో ప్రజలను మోసం చేస్తున్న 26వ డివిజన్ కార్పొరేటర్ బాలిన సురేశ్‌ను అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచినట్లు ఇంతెజార్‌గంజ్ సీఐ ఎల్ పవన్‌కుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. బాలిన సురేశ్ కమిట్‌మెంట్ చిట్టీల పేరుతో హనుమకొండ, వరంగల్ జిల్లాల్లోని సుమారు 100 మంది నుంచి రూ. 6 కోట్లు వసూలు చేశాడు. ఆ డబ్బులను వారికి తిరిగి ఇవ్వకుండా జాప్యం చేస్తున్నాడు. దీంతో బాధితులు పోలీస్‌స్టేషన్ ఫిర్యాదు చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు దర్యాప్తు చేపట్టి ఆదివారం తిలక్‌రోడ్‌లో సురేశ్‌ను అదుపులోకి తీసుకున్నారు. నిందితుడి నుంచి రూ.1.15 కోట్ల నగదు స్వాధీనం చేసుకొని రిమాండ్ తరలించారు.

ధ్వజస్తంభం ఏర్పాటుకు విరాళం

పర్వతగిరి, జనవరి 14: గోపనపెల్లిలో దూడెల మల్లికార్జున స్వామి ఆలయ పునఃర్నిర్మాణంలో భాగంగా ధ్వజస్తంభం ఏర్పాటు కోసం 3,00,116 విరాళాన్ని వర్కాల కనకయ్య-గౌరమ్మ జ్ఞాపకార్థం స్వామి-అనసూయ దంపతుల కుమారులు, కోడళ్లు ప్రభాకర్- తరుణి, డాక్టర్ శ్రీనివాస్- డాక్టర్ సౌజన్య, అశోక్- రేఖాదేవి, మునిమనవళ్లు, మనవరాళ్లు హర్షిత, దివిజ, అరుష్ ఆదివారం అందించారు. ఈ మేరకు సర్పంచ్ పంజా మహేశ్, ఆలయ ట్రస్టు చైర్మన్ బెల్లం బాలరాజుకు చెక్కు అందించారు. గతంలో 3 గుంటల భూమిని ఆలయం అభివృద్ధికి వీరి కుటుంబం అందించిందని తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బెల్లం వీరస్వామి, కారింగుల నర్సయ్యగౌడ్, ఉపసర్పంచ్ సూర అశోక్, ఎంపీటీసీ సూర రమేశ్ పాల్గొన్నారు.

మహాసభను విజయవంతం చేయండి

హనుమకొండ చౌరస్తా, జనవరి 14 : తెలంగాణ ప్రింట్ మీడియా డిస్ట్రిబ్యూటర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 16న హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహిస్తున్న మొదటి మహాసభను విజయవంతం చేయాలని అధ్యక్షుడు వుప్పు రాజేందర్, ప్రధాన కార్యదర్శి కుడికాల ప్రసాద్ పిలుపునిచ్చారు. ఆదివారం బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో సమావేశం నిర్వహించారు. కోశాధికారి యాపశెట్టి లక్ష్మణ్, కార్యవర్గ సభ్యులు దురిశెట్టి రమేశ్, ఎండీ అక్తర్ హుస్సేన్, నాయిని రాజేశ్, వెన్న రవి పాల్గొన్నారు.

ఐనవోలు జాతరలో ఏర్పాట్లు అంతంత మాత్రమే..

విద్యుత్ కంచెపై దుస్తులు ఆరేసిన భక్తులు

ఐనవోలు, జనవరి 14 : మంత్రి కొండా సురేఖ కలెక్టర్‌తో కలిసి సమీక్షించినా ఐనవోలు మల్లన్న జాతరలో ఏర్పాట్లు అంతంత మాత్రంగానే చేశారని భక్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. పారిశుధ్య సమస్యలు తలెత్తకుండా చూడాలని సురేఖ ఆదేశించినా అధికారులు బేఖాతరు చేశారు. విద్యుత్ శాఖ అధికారులు జాతరలో ట్రాన్స్‌ఫార్మర్ల కంచెకు సూచక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో భక్తులు వాటిని బట్టల దండాలుగా మార్చుకున్నారు. ఆలయం చుట్టూ పోలీసులు 10 చెక్‌పోస్టులు ఏర్పాటు చేసినా ఆలయ ఆవరణలోకి వాహనాలు వస్తుండడంతో భక్తులు అసౌకర్యానికి గురవుతున్నారు.

బల్దియా కార్మికుల సేవలు

వరంగల్ : ఐనవోలు జాతరలో బల్దియా కార్మికులు పారిశుధ్య సేవలు అందిస్తున్నారు. ఆదివారం 150 మంది కార్మికులు బయలుదేరి వెళ్లారు. 135 మంది పారిశుధ్య, 15 మంది అర్బన్ మలేరియా కార్మికులు, 15 మంది శానిటరీ జవాన్లు, 8 మంది శానిటరీ ఇన్‌స్పెక్టర్లు విధులు నిర్వర్తిస్తున్నారు. ఆరు రోజుల పాటు సేవలు అందించనున్నారు. 10 స్వచ్ఛ ఆటోలు, ఒక డంపర్ ప్లేసర్, మూడు ట్రాక్టర్లు, రెండు షీ టాయిలెట్ వాహనాలను జాతరకు పంపించినట్లు సీఎంహెచ్‌వో రాజేశ్ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి
భార్యతో పాటు పలువురు కొట్టడం వల్లే మృతిచెందాడని ఆరోపణ

సంగెం, జనవరి 14 : చికిత్స పొందుతూ వ్యక్తి మృతిచెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గవిచర్ల గ్రామానికి చెందిన భాషిపాక అనిల్(36), అదే గ్రామానికి చెందిన సుధను 12 సంవత్సరాల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నాడు. సుధ ఏఎన్ఎంగా విధులు నిర్వర్తిస్తున్నది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్యాభర్తల మధ్య మనస్పర్థలు రావడంతో 5 నెలల క్రితం సుధ తల్లి వాళ్లింటికి వెళ్లింది. ఈ నెల 3న అనిల్ సుధ డ్యూటీ చేస్తున్న దవాఖాన వద్దకు వెళ్లి కాపురానికి రావాలని గొడవ చేశాడు. ఈ క్రమంలో 4న అనిల్‌కు ఫిట్స్ రాగా కుటుంబ సభ్యులు ఎంజీఎం దవాఖానకు తరలించారు. అనిల్ తల, చేతులకు కొట్టిన గాయాలు ఉన్నాయని, ఆపరేషన్ చేయాలని డాక్టర్లు చెప్పారు. దీంతో అనిల్‌ను హైదరాబాద్ ఉస్మానియా దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. కాగా, భాషిపాక సుధ, బండి శ్రీనివాస్, భాషిపాక రాజు, ఉపేంద్ర, ఏలియా, ప్రమీల, వేల్పుల కుమారస్వామి, మమతతో పాటు మరికొందరు కొట్టడం వల్లే తన సోదరుడు అనిల్ మృతిచెందాడని, వీరిపై చర్యలు తీసుకోవాలని అన్న ప్రభాకర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

భూవివాదంలో ఎక్సైజ్ రిటైర్డు సీఐ
అతడితో పాటు రెవెన్యూ అధికారులపై కేసు నమోదు

సుబేదారి, జనవరి 14 : భూ వివాదంలో కోర్టు రెఫరెన్స్‌తో రిటైర్డు ఎక్సైజ్ సీఐ దిడ్డి నరేందర్, రెవెన్యూ అధికారులపై హనుమకొండ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. ములుగురోడ్డు సమీపంలో రెండున్నర ఎకరాల భూమిని నకిలీ సంతకాలతో దిడ్డి నరేందర్ పట్టా చేసుకొని వెంచర్ చేసి 40మందికి ప్లాట్లుగా విక్రయించాడు. నరేందర్‌కు ఆర్డీవో, తహసీల్దార్, రిజిస్ట్రార్ సహకరించారని మందాడి వినోద్‌కుమార్ కోర్టులో పిటిషన్ దాఖలు చేశాడు. కోర్టు రెఫరెన్స్‌తో నరేందర్ పాటు ఆర్డీవో, హనుమకొండ తహసీల్దార్, రిజిస్ట్రార్, ప్లాటు కొనుగోలు చేసిన 40 మందిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

కుక్కల దాడిలో 15 గొర్రెపిల్లల మృతి

కరీమాబాద్, జనవరి 14 : కుక్కల దాడిలో 15 గొర్రెపిల్లలు మృత్యువాత పడిన ఘటన ఆదివారం 42వ డివిజన్ పరిధిలోని యాదవనగర్‌లో జరిగింది. ఇట్టబోయిన ప్రసాద్‌కు చెందిన గొర్రెపిల్లలపై కుక్కలు దాడి చేయడంతో 15 మృతి చెందాయి. సుమారు లక్ష రూపాయల నష్టం జరిగిందని బాధితుడు వాపోయాడు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

గిర్మాజీపేట, జనవరి 14: వరంగల్ 33వ డివిజన్ అండర్ రైల్వేగేట్ హిందూ శ్మశాన వాటికలో సదుపాయాలు కల్పించాలని కోరుతూ స్థానిక నాయకులు ఆదివారం మంత్రి కొండా సురేఖను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వైట్ల శరత్, టీఎల్ఎఫ్ రేణుక, బండి బాచి, రాజమణి, అడబాల స్వరూప్, మండల పుష్పలత, హరిదయాళ్‌సింగ్, ఠాకూర్ గబ్బర్‌సింగ్, పంచగిరి సర్వేశం, స్వామి పాల్గొన్నారు.

కనుల పండువగా గోదారంగనాయకుల కల్యాణోత్సవం

నమస్తే నెట్‌వర్క్ : ఆలయాల్లో గోదా రంగనాయకుల కల్యాణోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. శాయంపేటలోని మత్స్యగిరిస్వామి, వేంకటేశ్వర శివ మార్కండేయస్వామి ఆలయాలతోపాటు, హనుమకొండలోని నందిహిల్స్ కాలనీలోని పంచముఖ ఆంజనేయస్వామి దేవాలయంలో, చెన్నారావుపేట మండలంలోని లింగగిరి చెన్నకేశవస్వామి ఆలయంలో, ఖానాపురం మండలం బుధరావుపేట వేంకటేశ్వరాలయంలో, రామన్నపేట బట్టలబజార్‌లోని బాలానగర్ వేంకటేశ్వరస్వామి ఆలయంలో, గిర్మాజీపేట గోవిందరాజులస్వామి ఆలయంలో కల్యాణాన్ని కనుల పండువగా నిర్వహించారు.

పేదింటి పెళ్లికి రూ.10వేల ఆర్థికసాయం

నగదును అందజేస్తున్న సరోజానవీరారెడ్డి

దామెర, జనవరి 14 : మండలంలోని ఒగులాపురం గ్రామానికి చెందిన మహ్మద్ అబ్దుల్ ఖలీల్, సల్మా దంపతుల కూతురు సిద్రాకు ఫిబ్రవరి 5న మహ్మద్ తాజ్‌తో వివాహం జరుగనుండగా, సర్పంచ్ కేతిపల్లి సరోజనావీరారెడ్డి రూ.10వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో నల్ల సుజాత, దామెర రజిని, సుల్తానా, దురిశెట్టి రమేశ్ పాల్గొన్నారు.

ఇంటింటికీ అయోధ్య రాముడి అక్షింతలు

పరకాల, జనవరి 14 : మండలంలోని అలియాబాద్ గ్రామంలో అయోధ్య రామయ్య అక్షింతలను ఆదివారం ఇంటింటికీ పంపిణీ చేశారు. అయోధ్య నుంచి వచ్చిన అంక్షింతలను సర్పంచ్ శాతరాసి రమాదేవి ఆధ్వర్యంలో రామభక్తులు ఇంటింటికీ తిరుగుతూ అందించారు. కార్యక్రమంలో రాజేందర్, రత్నాకర్, శ్రీరాములు, శ్రీనివాస్, బాబురావు పాల్గొన్నారు.

శాయంపేట : మండలంలోని మాందారిపేట, కొత్తగట్టుసింగారం, శాయంపేట గ్రామంలో మండల సంయోజక్ గిద్దెమారి సురేశ్ ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి అయోధ్య రామయ్య అక్షింతలను అందజేశారు. శాయంపేటలో పది వేల కుటుంబాలకు అక్షింతలను అందజేసినట్లు తెలిపారు. మహేశ్వర రాజు, ఆదిరెడ్డి, రమణారెడ్డి, రాజమల్లు, వేణు, రమేశ్, పురుషోత్తం, సాంబరాజు, గణేశ్, అనుకారి శివాజీ పాల్గొన్నారు.

ఎన్‌హెచ్‌ఆర్సీ మండలాధ్యక్షుడుగా జమాలుద్దీన్

నడికూడ, జనవరి 14 : జాతీయ మానవ హక్కుల కమిటీ (ఎన్‌హెచ్‌ఆర్సీ) మండలాధ్యక్షుడిగా మహ్మద్ జమాలుద్దీన్ నియమితులయ్యారు. రాష్ట్ర అధ్యక్షుడు బుద్ది పడగ శ్రీనివాసరెడ్డి ఆదేశాల మేరకు జిల్లా అధ్యక్షుడు చంద్రగిరి సునీల్ కుమార్ ఆదివారం నియామక పత్రం అందించారు.

తైబందీపై వీడని సస్పెన్స్

- యాసంగి సాగుపై అయోమయం
- పాకాల చివరి ఆయకట్టు రైతుల ఆందోళన
- సంగెం కాల్వ-3, 4 రైతులు నార్లు పోసుకోవద్దు
- ఐబీ డీఈ రమేశ్

ఖానాపురం, జనవరి 14: పాకాల యాసంగి తైబందీపై సస్పెన్షన్ వీడలేదు. ఈ నెల 8న పాకాల యాసంగి సాగుకు అధికారికంగా ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి నీరు విడుదల చేశారు. యాసంగిలో పూర్తిస్థాయి ఆయకట్టుకు నీటిని విడుదల చేస్తున్నట్లు అధికారులతో కలిసి ఎమ్మెల్యే ప్రకటించారు. అందుకనుగుణంగా రైతులందరూ నార్లు పోసుకున్నారు. అయితే, మూడు రోజులుగా గ్రామాల్లో తైబందీపై రకరకాల ప్రచారాలు జరుగుతున్నాయి. గోదావరి జలాలను పాకాలకు తరలించే పైపులు మరమ్మతులకు గురికావడంతో ఈ ఏడాది జలాలను తీసుకురావడం సాధ్యం కాదని తెలుస్తున్నది. అందుకే యాసంగి సాగును కొంతమేర నిలిపివేస్తున్నట్లు గ్రామాల్లో విపరీతంగా ప్రచారం జరుగుతున్నది. సంగెం 3, 4 కాల్వలతోపాటు జాలుబంధం పంట కాల్వ కింద సాగును పూర్తిగా నిలిపివేయడంతోపాటు తుంగబంధం కొంతమేర సాగును తగ్గిస్తున్నట్లు అనధికారికంగా రైతులకు సమాచారం అందింది. సంగెం 3, 4 పంట కాల్వ పారకంలో బుధరావుపేట, ధర్మారావుపేటకు చెందిన చిన్న, సన్నకారు రైతులే అధికంగా ఉన్నారు. వీరంతా ఇప్పటికే నార్లు పోసుకుని నాట్లు వేసేందుకు సిద్ధంగా ఉన్నారు. కాగా, ఆదివారం మనుబోతులగడ్డ శివారులో సంగెం కాల్వకు జేసీబీ యంత్రంతో ఐబీ అధికారులు అడ్డుకట్ట వేశారు. ఈ విషయం తెలుసుకున్న బుధరావుపేటకు చెందిన రైతులు సంగెం కాల్వ వద్దకు చేరుకుని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయమై ఐబీ డీఈ రమేశ్‌ను వివరణ కోరగా.. ప్రస్తుతం ఉన్న నీటి వనరులను పరిశీలిస్తే.. చివరి ఆయకట్టుకు సాగునీరు అందించడం సాధ్యం కాదన్నారు. దీంతో సంగెం కాల్వ 3, 4 పారకంలోని రైతులతోపాటు తుంగబంధం, జాలుబంధం, మాటువీరారం, పస్నూరు పంట కాల్వల చివరి ఆయకట్టు రైతులు నార్లు పోసుకోవద్దని, నాట్లు వేసుకోవద్దని కోరారు.

బాధితులను పరామర్శిస్తున్న ఎర్రబెల్లి, అరూరి, కడియం

బాధిత కుటుంబాలకు ప్రజాప్రతినిధుల పరామర్శ

పర్వతగిరి, జనవరి 14: మండలకేంద్రంలో పలు బాధిత కుటుంబాలను మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేశ్ ఆదివారం పరామర్శించారు. పర్వతగిరిలోని అర్షం ఆనందం మృతి చెందగా, ఆ కుటుంబాన్ని, గ్రామంలో వివిధ కారణాలతో ఇటీవల మృతి చెందిన జూలపెల్లి నర్సింహారావు, జనగాం బాలరాజు, చీదురు ఏకాంతం, నీరటి వీరన్న కుటుంబాలను వారు పరామర్శించారు. వారి వెంట ఎంపీటీసీ మాడుగుల రాజు, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ పట్టాపురం ఏకాంతంగౌడ్, సర్పంచ్ మాలతీ సోమేశ్వర్‌రావు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కుమార్‌గౌడ్, ఉపసర్పంచ్ రంగు జనార్దన్ గౌడ్, సర్వర్, మేరుగు వెంకన్న పాల్గొన్నారు.

నివాళులర్పిస్తున్న మాజీ స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి

రిటైర్డ్ హెచ్‌ఎం కుటుంబానికి ఎమ్మెల్సీ సిరికొండ పరామర్శ

శాయంపేట, జనవరి 14 : శాయంపేటకు చెందిన రిటైర్డ్ హెచ్‌ఎం కోమటి వీరస్వామి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి ఆదివారం ఆయన ఇంటికి వెళ్లి వీరస్వామి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మైలారం గ్రామంలో పలువురిని పరామర్శించారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ మాజీ మండలాధ్యక్షుడు గుర్రం రవీందర్ ఉన్నారు.

సురేశ్‌కు అంబేద్కర్ శాంతి అవార్డు

అవార్డు అందుకున్న సురేశ్

హనుమకొండ చౌరస్తా, జనవరి 14 : తెలంగాణ స్టేట్ హెచ్‌ఆర్సీ సోషల్ ప్రొటెక్షన్ రాష్ట్ర సభ్యుడు, ప్రపంచ మానవ హక్కుల కమిషన్ సభ్యుడు డాక్టర్ కే సురేశ్‌కు హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఉత్తమ అంబేద్కర్ శాంతి అవార్డు అందజేసింది. హనుమకొండ కొత్తూరు ప్రాంతానికి చెందిన సురేశ్ ఇటీవల ముంబైలో జరిగిన కార్యక్రమంలో ఈ అవార్డును అందుకున్నారు. చైర్మన్ కనుక నేస్తం, జాతీయ ఉపాధ్యక్షుడు వీరేందర్‌సింగ్ పాలీ, రాష్ట్ర ప్రెసిడెంట్ వెంకటేశ్వర్లు, వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాసరావు సురేశ్‌ను అభినందించారు.

ఎమ్మెల్యే నాగరాజుకు పుష్పగుచ్ఛం ఇస్తున్న సభ్యులు

ఎమ్మెల్యేను కలిసిన ఎన్ఎంఏ కార్యవర్గం

కరీమాబాద్/గిర్మాజీపేట/ మడికొండ, జనవరి 14: ఇటీవల ఎన్నికైన నేషనల్ మెడికల్ అసోసియేషన్ వరంగల్ నూతన కార్యవర్గం వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజును ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా సభ్యులు ఆయనకు పుష్పగుచ్ఛం అందజేశారు. అధ్యక్షుడు డాక్టర్ గుండా రవీందర్, సెక్రటరీ మైదం రాజు, సలహాదారులు డాక్టర్ మోహన్‌రావు, డాక్టర్ జగదీశ్వర్‌ప్రసాద్ పాల్గొన్నారు. అలాగే, కార్యవర్గ సభ్యులు మండిబజార్‌లో ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్యను మర్యాదపూర్వకంగా కలిశారు. కాగా, 45వ డివిజన్ కడిపికొండ బొడ్రాయి నుంచి చెరువు వరకు చేపట్టిన రోడ్డు విస్తరణ పనులను ఆర్అండ్‌బీ అధికారులతో కలిసి ఆదివారం ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు పరిశీలించారు.